

# 'కార్పొరేట్' ఒత్తిడి!

**పుస్తకాలతో కుస్తీ పట్టాల్సిందే.. జ్వరం వచ్చినా పంపేది లేదు**

**నిబంధనలు గాలికొదిలిన కార్పొరేట్ విద్యాసంస్థలు**

**ప్రత్యేక తరగతుల పేరుతో విద్యార్థులపై ఒత్తిళ్లు**

**ర్యాంకుల కోసం.. రాత్రింబవళ్లు తరగతులు నిర్వహణ**

**మానసిక ఒత్తిడికి గురవుతున్న ఇంటర్ విద్యార్థులు**

హైదరాబాద్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త: ఎల్‌కేజీ నుంచే ఐఐటీ వరకు స్పెషల్ టీచింగ్ ఇస్తూ.. దేశంలోనే గొప్ప పేరును సంపాదించుకున్న మన కార్పొరేట్ కాలేజీలు అందుకు తగ్గట్టుగా విద్యార్థుల ను పీల్చి పిప్పి చేస్తున్నారు. ఏడాది పొడవునా.. చదువులు పరీక్షలంటూ రకరకాల ప్రయోగాలు చేస్తూ విద్యార్థులను మానసిక ఒత్తిళ్లకు గురిచేస్తున్నారు. మరో నెలరోజుల్లో ఇంటర్ పరీక్షలు జరగనున్న నేపథ్యంలో ప్రత్యేక తరగతుల పేరుతో కొన్ని ప్రైవేట్ కళాశాలలు విద్యార్థులపై తీవ్ర ఒత్తిడి పెంచుతున్నాయి. పరీక్షలు పూర్తయ్యేవరకు ఒక్కరోజుకూడా సెలవులిచ్చేది లేదంటూ ఆది వారం కూడా తరగతులు నిర్వహిస్తున్నారు. దీంతో విద్యార్థులు ఎవరికీ చెప్పుకోలేక..అటు చద వలేక మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. విద్యార్థులంటే తమ కళాశాలలకు ర్యాంకులు తెచ్చే సాధనా లుగా చూస్తున్నారు. ఇటీవల నగరంలోని కొన్ని కార్పొరేటర్ జూనియర్ కళాశాలలు విద్యార్థులకు విరామం లేకుండా రాత్రి బవళ్లు పుస్తకాలతోనే కుస్తీ పట్టిస్తున్నారు. ఆటలకు కనీసం ఒక్క గంటకూడా కేటాయించడం లేదు. ఆటలు, డ్రాయింగ్, నృత్యం, గ్రంథాలయం వంటివి కాగితాల్లోనే చూపిస్తున్నారు. చాలా కాలేజీల్లో విద్యార్థులు నిత్యం పుస్తకాలతోనే గడుపుతున్నారు. పాఠ్యాంశాలు పూర్తికావటం లేదని ,విద్యార్థులు వెనకబడిపోతున్నారని అందకే సెలవుల్లో తరగతులు నిర్వహి స్తున్నామని తల్లిదండ్రులకు కళాశాల యాజమాన్యాలు తెలుపుతున్నాయి. మంచి ర్యాంకులు రావాలంటే విద్యార్థులపై కొంత ఒత్తిడి తప్పదని పేర్కొంటున్నారు. దీంతో తీవ్ర ఒత్తిళ్లకు గురై ఏదోఒక ప్రాంతంలో ఆత్మహత్యలకు పాల్పడుతున్న సంఘటనలు ఉన్నాయి. గతేడాది ఓవిద్యార్థి తమ కళాశాల తరగతులు నిర్వహిస్తుందంటూ ఓవిద్యాసంస్థకు చెందిన విద్యార్థులు చేతిని గాయపరచుకున్నారు. ఇలాంటి సంఘటనలు అక్కడ క్కడ జరుగుతున్న కార్పొరేట్ విద్యాసంస్థల్లో మార్పురావడం లేదని విద్యారంగ నిపుణులు అంటున్నారు.



**ఇంటికెళ్లేది లేదు..** పరీక్షలు పూర్తయ్యే వరకు ఒక్కరోజు కూడా సెలవు లేదంటూ విద్యార్థులను విద్యాసంస్థల్లోనే ఉంచుతున్నారు. కనీసం వారాంతపు సెలవులను విద్యార్థులకు ఇవ్వడంలేదు. ప్రత్యేక తరగతుల పేరుతో నిరంతరం తరగతులు నిర్వహిస్తుండటంతో జైల్లో ఉన్నట్లుగా ఉందని పలువురు విద్యార్థులు తెలుపుతున్నారు. జ్వరం వచ్చినా తరగతులకు హాజరవుతున్నామని తెలుపుతున్నారు. దీంతో తీవ్ర ఒత్తిడికి లోనవుతున్న పలువురు విద్యార్థులు ఎవరికీ చెప్పకుండా అక్కడి నుండి బయ టకికి వచ్చేస్తున్నారు. రోజుకు ఎన్ని గంటలు తరగతులు జరగాలి.. ఎంతసేపు విరామం ఇవ్వాలి.. తదితర నిబంధనలను గ్రేటర్ పరిధిలోని చాలా కార్పొరేట్ విద్యాసంస్థలు పట్టించుకోవట్లేదనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. విద్యార్థులు ఇష్టంతో ప్రమేయం లేకుండా.. ఇష్టారాజ్యంగా తరగతులు నిర్వహిస్తున్నా రని పలువురు విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. గతేడాది ఇదే సమయంలో వనస్థలిపురం, కూకట్‌పల్లి ప్రాంతాల్లో ఒత్తిడికిలోనై ఆత్మహత్య సంఘటనలు అందరికీ తెలిసిందే. దీంతో తల్లిదండ్రులు కూడా తరగతులు నిర్వహణ విషయంలో ఆందోళన చెందుతున్నారు.



# హైదరాబాద్ వార్త

# దక్కన్‌మాల్ బాధిత ప్రజలకు మంత్రి హామీ

**దక్కన్ మాల్ కూల్చివేసిన ప్రాంతాన్ని సందర్శించిన మంత్రి తలసాని**

**జనవాసాల మధ్య ఉన్న గోదాములను తరలించడం ద్వారా భవిష్యత్‌లో అగ్ని ప్రమాదాలను నివారించవచ్చంటూ బస్తీ వాసులకు హామీ**

బేగంపేట, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త : జనవాసాల మధ్య ఉన్న గోదాములను తరలించడం ద్వారా భవిష్యత్‌లో ఎలాంటి అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోనున్నట్లు పశుసంవర్ధక మత్స్య, పాడిపరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బుధవారం సనత్‌నగర్ నియోజకవర్గం పరిధిలోని మినిస్టర్ రోడ్‌లో ఇటీవల అగ్ని ప్రమాదం జరిగిన దక్కన్ మాల్ భవనాన్ని కూల్చివేయగా, మంత్రి వివిధ శాఖల అధికారులతో కలిసి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న కాలనీలో పర్యటించి అగ్ని ప్రమాదంతో జరిగిన నష్టం గురించి ప్రజలను అడిగి తెల్సుకున్నారు. అగ్ని ప్రమాదం వల్ల తమ ఇండ్లపై ఉన్న వాటర్ ట్యాంకులు కాలిపోయాయని, గోడలు నెర్రెలు వచ్చాయని మంత్రికి వివరించారు. స్పందించిన మంత్రి ఇచ్చిన హామీ మేరకు మరమ్మతులు ప్రభుత్వ పరంగా చేపడతామని,ట్యాంకులు కొత్తవి కొనుగోలు చేసి అందిస్తామని, కాలనీ వాసులకు చెప్పారు.కాలనీలో పడిపోయిన భవన వ్యర్థాలను పూర్తి స్థాయిలో తొలగించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.కాలనీలో నూతన రోడ్ల నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు.భవనం పూర్తి స్థాయిలో కూల్చివేత పనులు మరో రెండు రోజుల్లో పూర్తి అవుతాయని చెప్పారు. ప్రమాదం జరిగిన నాటి నుంచి తమకు ఏ ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకున్న మంత్రికి కాలనీ వాసులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేసారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పరిసర ప్రజలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా నూతన పరిజ్ఞానంతో భవనం కూల్చివేత చేపట్టినట్లు పేర్కొన్నారు.ప్రమాదం జరిగిన వెంటనే అధికారులు సకాలంలో స్పందించి స్థానిక ప్రజలను సురక్షిత ప్రాంతానికి తరలించి వసతి కల్పించి నాటి నుంచి నేటి వరకు భోజన సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. కాలనీలో హెల్త్ క్యాంపును కూడా కొనసాగిస్తున్నట్లు చెప్పారు. భవిష్యత్‌లో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు.జనావాసాల మధ్య ఉన్న గోదాములను ఇతర ప్రాంతాలకు తరలిస్తామని,స్పష్టం చేసారు. గోదాముల నిర్వాహకులు సరూన జాగ్రత్తలు పాటించని కారణంగానే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని అన్నారు, మంత్రి వెంట మాజీ కార్పొరేటర్ అత్తెల్లి అరుణా శ్రీనివాస్‌గౌడ్,ఆర్డీవో వసంత,డిసీ ముకుందరెడ్డి, తహశీల్దార్ శైలజ, ఈఈ సుదర్శన్, టౌన్ ప్లానింగ్ ఏసీపీ క్రిస్టోఫర్, శానిటేషన్ డీఈ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



దక్కన్ మాల్ పక్కన బస్తీల ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి తలసాని

## రైతు వ్యతిరేక విధానాలపై దేశవ్యాప్త సమరశీల ఉద్యమాలు

**అఖిలభారత కిసాన్‌సభ(ఎఐకెఎస్) జాతీయ ప్రధాన కార్యదర్శి విజ్జు కృష్ణన్**





ప్రసంగిస్తున్న అఖిలభారత కిసాన్‌సభ(ఎఐకెఎస్) జాతీయ ప్రధాన కార్యదర్శి విజ్జు కృష్ణన్

చిక్కడపల్లి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం అవలంభిస్తున్న రైతువ్యతిరేక విధానాలపై దేశవ్యాప్త సమరశీల ఉద్యమాలు చేపట్టాలని అఖిలభారత కిసాన్‌సభ(ఎఐకెఎస్) జాతీయ ప్రధాన కార్యదర్శి విజ్జు కృష్ణన్ పిలుపునిచ్చారు. బుధవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఎఐకెఎస్ జాతీయ కార్యవర్గ సభ్యుల సమావేశం జాతీయ ఉపాధ్యక్షుడు హన్నన్‌మొల్ల అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా విజ్జుకృష్ణన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి రాతపూర్వకంగా ఇచ్చిన హామీని తుంగలొతొక్కిందని, కనీస మద్దతు ధరల చట్టం చేస్తానని అమలు చేయలేదనని, రైతుల ఆత్మహత్యల పరంపరం ఆపడానికి ఈబడ్జెట్‌లో ఏరకమైన కేటాయింపులు చేయలేదని, పైగా కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సిసిఐ)కు కేటాయించాల్సిన నిధులను పూర్తిగా తగ్గించివేశారని, పత్తి కొనుగోలుకు కేంద్ర ప్రభుత్వం ఏచర్యలు తీసుకోవడం లేదని, ఫలితంగా మద్యదళారీలు రైతుల నుంచి కనీస మద్దతు ధరకంటే తక్కువగా కొనుగోలు చేస్తున్నారని, ఎరువుల సబ్సిడీని కుదించడం వల్ల రైతాంగానికి, ఆహారభద్రతకు తీవ్ర ముప్పు వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో అఖిలభారత కోశాధికారి కృష్ణప్రసాద్, ఉపాధ్యక్షుడు విజరుకుమార్, అమల్ హాల్దా, అమ్రరాం, ఎస్‌కె.ప్రీజ, షణ్ముగం, బిప్లవ్ మజుందర్, ఇంద్రజిత్, సహాయ కార్యదర్శులు టి.సాగర్, రవీంద్రన్, డాక్టర్ అజిత్ నవలే, అవదేశ్‌కుమార్, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మహా శివరాత్రి మహోత్సవాలకు ముస్తాబవుతున్న పాతబస్తీ శివాలయాలు



శివాలయంలోని స్పటిక శివలింగం

చార్మినార్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త : పాతనగరంలోని శివాలయాలు మహా శివ రాత్రి మహోత్సవాలకు ముస్తాబవుతున్నాయి. పాత బస్తీ లోని అన్ని శివ మందిరాలలో శివ రాత్రిఉత్సవాలను ఎంతో వైభవంగా నిర్వహిస్తారు. మరో తొమ్మిది రోజులలో శివ రాత్రి పర్వ దినం రానున్నది.శివరాత్రి సందర్భంగా ఛత్రినాక శివగంగానగర్‌లోని శ్రీ లక్ష్మణేశ్వర స్వామి దేవాలయం, కేశవగిరి చెన్న కేశవ స్వామి శివాలయం,చార్‌కమాన్ శివాలయం,చార్మినార్ శ్రీమహదేవ్ మందిరం, ఎంతో పురాతనమైన కిషన్‌బాగ్ శ్రీ కాశీ బుగ్గ శివాలయం, హుస్సేనీఆలం శివ మందిరం,పురానాపూల్ శివాలయం, చేలాపుర శివ మందిరంతో పాటు పాతబస్తీలోని అన్ని శివాలయాలను శివ రాత్రి సందర్భంగా సుందరంగా తీర్చి దిద్దుతున్నారు. కిషన్‌బాగ్ శ్రీ కాశీ బుగ్గ శివాలయంలో శివ రాత్రి రోజన వేలాది మంది భక్తులు పరమ శివునికి ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహిస్తారు.కాగా పాతబస్తీలోని పలు శివాలయాలను ఇప్పటికే అందంగా తీర్చిదిద్దారు. చార్మినార్ శ్రీ మహాదేవ్ మందిరంలో 18వ తేదీన శ్రీ మహా శివరాత్రి మహోత్సవాలను వైభంగా నిర్వహించటానికి నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.మహదేవ్ మందిరంలో ఉన్న స్పటిక శివ లింగానికి వేలాది మంది భక్తులు పూజలు నిర్వహించటానికి రానున్నారు.మహా శివ రాత్రి సందర్భంగా పలు శివాలయాలలో భజన సంధ్య కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

## రియల్ ఎస్టేట్ వ్యాపారి హత్య

కంటోన్మెంట్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: ఆర్థిక లావాదేవీల కారణాలతో ఓ వ్యక్తిని దారుణంగా హత్య చేసిన సంఘటన బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం దిల్‌షుక్‌నగర్ ప్రాంతానికి చెందిన ఫయాజుద్దీన్ (40) కె.ఎం.ఆర్. ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో దాదాపు రూ.50 లక్షల వరకు పెట్టుబడులు పెట్టాడని, సంస్థలో వచ్చిన లాభాలను ఫయాజుద్దీన్ ఇవ్వకపోవడంతో డబ్బుల విషయం మాట్లాడుకుందామని పిలిపించాడు. డబ్బుల వ్యవహారంలో ఇరు వర్గాలు ఘర్షణ పడ్డారు. ఆగ్రహానికిలోనైన ఫయాజుద్దీన్ సిద్దికిపై కత్తితో కడుపులో తీవ్రంగా గాయపర్చి పారిపోయాడు. విషయాన్ని గమనించిన స్థానికులు 100 నెంబర్‌కు ఫోన్ చేయడంతో సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని రక్తం మడుగులో సిద్దికిని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మరణించాడు. ఈ కేసును బోయిన్‌పల్లి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. హత్య చేసిన ఫయాజుద్దీన్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

## కీసరగుట్టకు ప్రత్యేక బస్సులు

### డిఎం రాంమోహన్

అడ్డగుట్ట, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు 3 రోజుల పాటు కీసర గుట్టకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు కంటోన్మెంట్ డిపో మేనేజర్ ఎల్.రాంమోహన్ తెలిపారు. బుధవారం సికింద్రాబాద్ జె.బి.ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్ స్టేషన్ నుంచి కీసర గుట్ట ఆలయం వరకు ఒక్కొక్కరికి రూ.60 చొప్పున టికెట్ ధర ఉంటుందన్నారు. మహా శివరాత్రి సందర్భంగా భక్తులకు, ప్రయాణికులకు శివుడిని దర్శించుకునేందుకు మూడు రోజుల పాటు నిరంతరంగా ప్రతి 15 నిమిషాలకు ఒక బస్‌ను నడుపుతామన్నారు.

## బిజెపి పాలనతో దేశం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది

**మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్**



హాథ్ సే హాథ్ జోడో ప్రచారంలో అంజన్‌కుమార్ యాదవ్

ధర్నాచౌక్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త: బీజేపీ పాలనతో దేశం తీవ్ర సంక్షోభంలో కూరుకు పోయిందని మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ ఆరోపించారు. బుధవారం ముషీరాబాద్ నియోజకవర్గంలోని కవాడిగూడ డివిజన్‌లో హాథ్ సే హాథ్ జోడో ప్రచారాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అంజన్ కుమార్ యాదవ్ కాంగ్రెస్ నేతలతో కలసి ఇంటింటికి తిరుగుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వతంత్ర్యం కోసం, స్వతంత్ర్య అనంతరం దేశాన్ని సామాజికంగా, ఆర్థికంగా, వైజ్ఞానికంగా ఉన్నత శిఖరాలకు తీసుకువెళ్లేందుకు, భారతదేశ ప్రగతికి గత 137 ఏళ్లుగా కాంగ్రెస్ కుటుంబం అంకితమై ఉందని అన్నారు. భారత దేశ ప్రజల బాధలు తెలుసుకునేందుకు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ 3,500 కి.మీ భారత జోడో యాత్ర నిర్వహించారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కూడా అధికారంలోకి రాకముందు కేసీఆర్ ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదని, తెలంగాణ కోసం ప్రాణాలర్పించిన అమరుల కుటుంబాలకు ఎటువంటి సాయం అందించలేదని ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీ పెట్టి తెలంగాణ పదాన్ని విస్మరించిన కేసీఆర్ తెలంగాణ అస్థిత్వాన్ని దెబ్బతీశారని విమర్శించారు. ఈ జోడో ప్రచారంలో ఆల్ ఇండియా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ యాదవ్, స్థానిక కాంగ్రెస్ నేతలు వి.డి.కృష్ణ, ధర్మేందర్, సాయిబాబా, పాశం అనిల్ కుమార్ యాదవ్, లక్ష్మణ్, అయూబ్, రాజు, జోయబ్‌హుస్సేన్, శ్రీరాముల యాదగిరి, మాజీ కార్పొరేటర్ వాజిద్ హుస్సేన్ పాల్గొన్నారు.

## బీసీల అభివృద్ధి పట్టించుకోని ప్రభుత్వాలు మాకొద్దు

**బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్**

ధర్నాచౌక్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త: బీసీల సంక్షేమం కోసం సరియైన నిధులు కేటాయించలేని ప్రభుత్వాలు, బీసీల అభివృద్ధి పట్టించుకోని ప్రభుత్వాలు మాకెందుకని బీసీ సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌పై బుధవారం దోమలగూడలోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్‌లో బీసీల వాటా రెండు శాతం మించకపోవటం పట్ల ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర బడ్జెట్‌పై మొన్న కేటీఆర్ అసెంబ్లీలో మాట్లాడుతూ బీసీలపై కేంద్రానికి చిన్నచూపని, అందుకే బీసీలకు కేంద్ర బడ్జెట్‌లో కనీసం ఐదుశాతం కూడా నిధులు బీసీలకు కేటాయించలేదని విమర్శించారు, మరి ఈరోజు మీరు చేసిందేమిటని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ బీసీ వ్యతిరేక ప్రభుత్వాలని, బీసీలకు అన్యాయం చేయటంలో దొందూ దొందేనని ఎద్దేవా చేశారు. గత ఎనిమిది సంవత్సరాలుగా బీసీలకు పెద్ద పీటవేస్తున్నామంటూ హారీష్‌రావు గొప్పలు చెబుతున్నారు కానీ అసలు బీసీ జనాభా ఎంత, రాష్ట్ర బడ్జెట్ ఎంత, అందులో బీసీలకు కేటాయించింది ఎంత, ఖర్చు చేసింది ఎంత అన్నది లెక్కలు తీయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ ఎస్టీలకు ఏ విధంగా ప్రత్యేక ప్రణాళిక ఉందో అటువంటి ప్రణాళికను బీసీలకు తెస్తానని చెప్పిన కేసీఆర్ ఆ మాటే మర్చిపోయారని ఆరోపించారు. బీసీ బందు ఊసే ఎత్తటం లేదని, అసలు బీసీల సంక్షేమం కోసం కేటాయిస్తున్న నిధులలో కనీసం 50శాతం కూడా విడుదల చేయటం లేదని అన్నారు. 60శాతం జనాభా ఉన్న బీసీలకు రెండు శాతం నిధులు కేటాయించటం సిగ్గుచేటని, రెండు శాతం నిధులతో బీసీల అభివృద్ధి ఎలా సాధ్యమవుతుందని ధ్వజమెత్తారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు మాదేశి రాజేందర్, జాజుల లింగం, మణిమంజరి పాల్గొన్నారు.



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్

## మధ్యాహ్న భోజన వంట కార్మికుల డిమాండ్లను అమలు చేయాలి



ధర్నాలో పాల్గొన్న మధ్యాహ్న భోజన వంట కార్మికులు

సైఫాబాద్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: మధ్యాహ్న భోజనం పథకం కింద పనిచేస్తున్న వంట కార్మికులు తమ డిమాండ్లను అమలు చేయాలని కోరుతూ బుధవారం హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్ ఎదుట భారీగా ధర్నా నిర్వహించారు. తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర సమితి ఇచ్చిన పిలుపు మేరకు ఈ ధర్నాలో వివిధ జిల్లాలకు చెందిన వందలాది మంది కార్మికులు పాల్గొ న్నారు. ఈ సందర్భంగా ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.డి.యూసఫ్, ఎస్.బాల్‌రాజ్, సినీయర్ నాయకుడు వి.ఎస్.బోస్ తదితరులు మాట్లాడుతూ రాష్ట్రంలోని 26 వేల పాఠశాలల్లో 54వేల 201 మంది మధ్యాహ్న భోజనం పథకం కింద వంట కార్మికులు 28 లక్షలకుపైగా విద్యార్థులకు ఆహారాన్ని అందిస్తూ విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వంట కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ఘోరంగా విఫలం చెందాయని ఆరోపించారు. వారికి ఇచ్చే గౌరవ వేతనం 1000 రూపాయల నుంచి రెండు వేలకు, మూడు వేలకు పెంచడం జరిందని చెప్పారు. ఇదేమైన వేతనమా?, కనీసం రోజుకు మూడు వందల రూపాయలైన ఉండాలని ఈ వేతనం 12 నెలల పాటు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో యూనియన్ గౌరవ అధ్యక్షురాలు కమలారెడ్డి, అధ్యక్షురాలు పి.ప్రేమ్ పావని, ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ పూసాల రమేష్, నాయకులు సత్తెనపల్లి విజయలక్ష్మి, సుగుణ, రాములు తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ రంగం దేశానికి వెన్నెముక లాంటిది : డిసిపి ఆర్.జగదీష్ రెడ్డి

చార్మినార్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త : వ్యవసాయ రంగం దేశానికి వెన్నెముక లాంటిందని రాజేంద్ర నగర్ డిసిపి ఆర్. జగదీష్ రెడ్డి అన్నారు. రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వ విద్యాలయం ఆడిటోరియంలో గురువారం జరిగిన అంతర కళాశాలల క్రీడలు,సాంస్కృతిక పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్ధులను ఉద్దేశించి మాట్లాడుతూ మన దేశానికి వ్యవసాయ రంగం వెన్నెముక లాంటిదని తెలిపారు.వ్యవసాయ విశ్వ విద్యాలయాల విద్యార్దులు కొత్త టెక్నాలజీతో వ్యవసాయ రంగంలో అభివృద్ధి పరచగలరని ఆయన తెలియజేశారు.రిజిస్ట్రార్ ఎస్.సుధీర్ కుమార్ మాట్లాడుతూ వ్యవసాయ కళాశాలలో క్రీడలకు సంబంధించిన వసతులు మెరుగు పరుస్తూ బాలికలకు ప్రత్యేకంగా జిమ్ వసతిని ఏర్పాటు చేస్తామని తెలియజేశారు.క్రీడల పోటీలలో వ్యవసాయ కళాశాలలకు చెందిన 570 మంది విద్యార్దులు పాల్గొన్నారు.క్రికెట్ ఫైనల్ పోటీలో రాజేంద్రనగర్ కళాశాల విద్యార్దులు గెలు పొందగా,జగిత్యాల కళాశాల విద్యార్దులు రెండవ స్థానాన్ని దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో విశ్వ విద్యాలయం అధికారులు డాక్టర్ వి.అనిత,డా.జె సత్యనారాయణ,డా.రత్నకుమారి,డా.జమునా రాణి,కళాశాల అసోసియేట్ డీన్ సి.నరేంద్రరెడ్డి,యూనివ ర్శిటి పరిశీలకులు డా.బి.విద్యాసాగర్,డాక్టర్ వి.రవీంద్ర నాయక్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ కళాశాల విద్యార్థినీలు

## జీడిమెట్ల పారిశ్రామిక వాడలో మరో ఘోర అగ్నిప్రమాదం

**ఆలస్యంగా వెలుగులోకి..**

**ఒకరు మృతి.. ఇద్దరి పరిస్థితి విషమం**

**శోధనా లాబరేటరీలో ఇది**

**కొత్తేమికాకున్నా పట్టీపట్టని అధికార యంత్రాంగం**

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త : జీడిమెట్ల పారిశ్రామికవాడలోని ఒక కెమికల్ కంపెనీలో చోటుచేసుకున్న అగ్నిప్రమాదం ఒక కార్మికుడిని బలి తీసుకోగా మరో ఇద్దరు కార్మికులను చావుబతుకుల మధ్యకు నెట్టేసింది. ఈ పరిశ్రమలో చోటుచేసుకున్న ఈ ప్రమాదం రెండోది కావటం మరో విశేషం. జీడిమెట్ల పారిశ్రామికవాడలోని శోధనా లాబరేటరీస్‌లో ఇటీవల చోటుచేసుకున్న అగ్నిప్రమాదం మరవకముందే సోమవారం అర్ధరాత్రి వంటిగంటకు చోటుచేసుకున్న అగ్నిప్రబాదం తీవ్ర కలకలంరేపగా కంపెనీలో కార్మికుడిగా పనిచేస్తున్న వేదాంత్ అనే కార్మికుడు అక్కడికి అక్కడే అగ్నిప్రమాదంలో ప్రాణాలు కోల్పోగా ఇదేసమయంలో ఇతనితో పాటు పనిచేస్తున్న శ్రీధర్, జయదేవ్ అనే కార్మికులు అగ్రప్రమాదంలో తీవ్రగాయాలపాలై చావుబతుకుల మధ్య ఆపోలో ఆసుపత్రితో చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు. జీడిమెట్ల పారిశ్రామికవాడలోని గంపలబస్తీలో కెమికల్ కంపెనీల అక్రమ లావాదేవీలకు సంబందించి గత దశాబ్దకాలంగా అధికారులకు ఫిర్యాదులపై ఫిర్యాదులు అందుతున్నా తూతూమంత్రంగా చర్యలు తీసుకుని చేతులు దులుపుకుంటున్నతీరుకు సోమవారం అర్థరాత్రి దాటిన తరువాత శోధన లాబరేటరీస్‌లో చోటుచేసుకున్న అగ్నిప్రమాదం ఒక ఉదాహారణగా నిలుస్తుంది. ఈ అగ్ని ప్రమాదంలో వేదాంత్ అనే కార్మికుడు అక్కడికి అక్కడే మృతిచెందిన సంఘటన స్థానికంగా తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నా కార్మికశాఖ అధికారులు గానీ, పరిశ్రమల శాఖగానీ, ఇటు పొల్యూషన్ కంట్రోల్‌బోర్డుగానీ అస్సలు పట్టించుకోకపోవడంతో ప్రమాదాలు నిత్యకృత్యమైయ్యాయనే విమర్శలు వినిపిస్తున్నారు. అయితే శోధనా లాబరేటరీస్‌లో సోమవారం తెల్లవారుజామున జరిగిన అగ్నిప్రమాదం తీరుతీవ్ర ఆందోళనకు గురిచేస్తుంది. కంపెనీలో ఆ సయమలో పనిచేచేస్తున్న ముగ్గురు కార్మికులకు గాను యాజమాన్యం ఒక కార్మికుడు మృతిచెందాడని చెబుతున్నా మిగిలిన ఇద్దరు కార్మికులు శ్రీధర్, జయదేవ్‌లలో కూడా మరొకరు చనిపోయినట్లు కార్మికులు ఆందోళన చెందుతున్నారు. అయితే పోలీసులు మాత్రం వేదాంత్ మృతిని ధృవీకరించారని, మిగిలిన కార్మికులు చికిత్స పొందుతున్నట్లు చెబుతున్నా ఆ మాటల్లో వాస్తవం లేదని కార్మికులు ఆందోళన చెందుతున్నారు. ప్రమాదం సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకోవడంతో వారిని నగరంలోని ఆపోలో ఆసుపత్రికి తరలించారు. పోలీసులకు సైతం సమాచారం ఆలస్యంగా అందటంతో పలుకోణాల్లో విచారణ ప్రారంభించారు. ఈమేరకు జీడిమెట్ల సర్కిల్‌ఇన్‌స్పెక్టర్ పవన్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## అగ్నిప్రమాదంపై సకాలంలో స్పందించిన డిప్యూటీ మేయర్



ఘటనా స్థలంలో నగర డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి

తార్నాక, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: తార్నాక సండే మార్కెట్ ప్రాంతం సమీపంలోని ఓ అపార్ట్‌మెంట్ పెంట్ హౌజ్‌లో ప్రమాదవశాత్తు మంటలంటుకున్నారు. దీంతో స్థానికుల సమాచారంతో విషయం తెలుసుకున్న నగర డిప్యూటీ మేయర్ శ్రీలతశోభన్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర కార్మిక విభాగం అధ్యక్షులు మోతె శోభన్‌రెడ్డి స్పందించి వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో పాటు స్థానిక ఓ.యూ ఇన్స్‌పెక్టర్ రమేష్‌నాయక్, జీహెచ్‌ఎంసీకి కూడా సమాచారం అందించారు. వారు వెంటనే ఘటనా స్థలానికి వచ్చి మంటలను ఆర్పారు. ముందు జాగ్రత్తగా అపార్ట్‌మెంట్‌లో ఉన్న వారిని సైతం కిందికి పంపించారు. డిప్యూటీ మేయర్ అక్కడే ఉండి పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకున్నారు. అగ్నిప్రమాదం జరిగిన అపార్ట్‌మెంట్ పూర్తిగా శిథిలావస్థకు చేరిందని దానిపై సమగ్రంగా విచారణ చేపట్టి అవసరమైతే కూల్చివేయాలని డిసీ దశరథ్‌ను డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి ఆదేశించారు.

**అగ్నిప్రమాదాలపై అపార్ట్‌మెంట్ వాసులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి : డిప్యూటీ మేయర్**

ఇటీవల తరుచు నగరంలో అగ్నిప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో ఉన్న అపార్ట్‌మెంట్ వాసులు తగిన జాగ్రత్తలు తీసుకొని ప్రభుత్వ అధికారుల సూచలను పాటించాలని సూచించారు. కాగా అగ్నిప్రమాదం జరిగిన పెంట్ హౌజ్‌లో ఎవరు లేకపోవడంతో అందులో ఉన్న బెడ్‌లు, నిత్యవసర వస్తువులు, వంటసామాగ్రి కాలిబూడిద అయ్యింది.

## సమస్యలను తన దృష్టికి తీసుకురావాలి

### గోల్నాక కార్పొరేటర్ లావణ్య శ్రీనివాస్‌గౌడ్



సిబ్బందితో క్లీన్ అండ్ గ్రీన్ పనిచేయిస్తున్న కార్పొరేటర్

హైదరాబాద్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: గోల్నాక డివిజన్‌లోని అశోక్‌నగర్‌లో బుధవారం స్థానిక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్ విస్తృతంగా పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ డ్రైనేజీ, విద్యుత్, మంచినీరు, క్లిన్ అండ్ గ్రీన్ తదితర సమస్యలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆమె జిహెచ్‌ఎంసి అధికారి తిరుపతి, ఎస్‌ఎఫ్‌ఎలకు ప్రజా సమస్యలను వివరించి తక్షణమే పరిష్కరించాలని సూచించి, సిబ్బంది దగ్గరుండి క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని చేయించారు. అలాగే వివిధ బస్తీలు, కాలనీల్లో ఏ సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకురావాలని కాలనీల, బస్తీల అధ్యక్షులకు ఆమె తెలిపారు. సమస్యలు సత్వరమే పరిష్కారిస్తానని చెప్పారు.

## పేదలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి : మర్రి రాజశేఖర్ రెడ్డి



సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న మర్రి రాజశేఖర్ రెడ్డి

కంటోన్మెంట్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: పేదప్రజల సంక్షేమం కోసం ముఖ్య మంత్రి కేసిఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశంలోనే ఆదర్శంగా నిలిచాయని మల్కాజిగిరి పార్లమెంట్ బిఆర్‌ఎస్ ఇన్‌ఛార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. కంటోన్మెంట్ బాపూజీ నగర్, కడక్‌పురకు చెందిన సర్వర్‌కు రూ.60 వేలు, ఎస్.శంకర్‌కు రూ.18 వేలు మెరుగైన వైద్యం కోసం సిఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన చెక్కులను బుధవారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి, బిఆర్‌ఎస్ నేతలు ముప్పిడి మధుకర్, రాజుసింగ్ తదతరులు పాల్గొన్నారు.

## ఈ నెల 11,12 తేదీల్లో ఫిస్ట్‌బాల్ పోటీలు

కంటోన్మెంట్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: తెలంగాణ ఫిస్ట్ బాల్ అసోసియేషన్ సహకారంతో ఈ నెల 11,12 తేదీల్లో బోయిన్‌పల్లి ప్లే గ్రౌండ్‌లో ఫిస్ట్‌బాల్ పోటీలు నిర్వహించనున్నట్లు చైర్మన్ జంపనప్రతాప్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఫిస్ట్ బాల్ అసోసియేషన్ సహకారంతో ఫిస్ట్‌బాల్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని ఆసక్తిగల క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## పురానాహావేలిలో మొదటి ఇమామ్ జయంతి ఉత్సవాలు



సీనియర్ బిజెపి నాయకులు మీర్ ఫిరాసత్ అలీ బాక్రీని సన్మానిస్తున్న దృశ్యం

చార్మినార్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త : పాతబస్తీ పురానీ హవేలిలో ఇమామియా ఎడ్యుకేషనల్ ట్రస్ట్,అర్జ్-ఎ-రిసాలత్ కమిటిల సంయుక్త ఆధ్వర్యంలో మొదటి ఇమామ్ జయంతి ఉత్స జరిగాయి.దారుషిఫా ప్రాంతానికి చెందిన సీనియర్ బిజెపి నాయకులు మీర్ ఫిరాసత్ అలీ బాక్రీని ఈ సందర్భంగా శాలువ కప్పి సన్మానించారు.ఈ కార్యక్రమంలో మౌలానా సయ్యద్ అలీ హుస్సేనీ ఖుమీ,మౌలానా సయ్యద్ జాఫర్‌యాబ్ హైదర్ రజ్వీ, అర్జ్-ఎ- రిసాలత్ కమిటి అధ్యక్షులు మౌలానా సయ్యద్ షనే హైదర్ జైదీ,మౌలానా సయ్యద్ మోసిన్ కమాల్ రజ్వీ,మీర్ అశ్వాక్ అలీ ఖాన్,యూసుప్ హుస్సేన్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

చిక్కడపల్లి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: అడిక్‌మెట్ డివిజన్‌లోని జమిస్తాన్‌పూర్ ప్రభుత్వ పాఠశాలలో జహంగీర్, లింగం యాదవ్ సహకారంతో 10వ తరగతి విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ కార్యక్రమం బుధవారం జరిగింది. ముఖ్యఅతిథిగా ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ హాజరై వీటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిఆర్‌ఎస్ యువనేత ముఠాజైసింహ, డివిజన్ బిఆర్‌ఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి సురేందర్, శ్యామ్‌సుందర్, పార్టీ సీనియర్ నేత బొట్టు శ్రీను, కిషోర్, ఆకారం శ్రీనివాస్, అబ్బుబాయ్, నాగులు, శంకర్ ముదిరాజ్, హరీష్, స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యక్షులు, బిఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గడ్డం శ్రీనివాస్‌యాదవ్‌కు సన్మానం



అఫ్జల్‌గంజ్,ఫిబ్రవరి 8ప్రభాతవార్త: శివరాత్రి ప్రాభవం. శివశక్తివైభవంశివశక్తి,భక్తి సంగీత,నృత్య కార్యక్రమంలో గడ్డం గంగాధర్ ఫౌండేషన్ చైర్మన్,బిఆర్‌ఎస్ నాయకులు గడ్డం శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.ఈసందర్భంగా గడ్డం శ్రీనివాస్‌యాదవ్ ప్రభుత్వ సలహాదారులు సముద్రాల వేణుగోపాలచారి శాలువ కప్పి సన్మానించారు. ఈకార్యక్రమంలో దైవజ్ఞశర్మ,ఎసిపి రాందాస్‌తేజా తదితరులు పాల్గొన్నారు.

## విశ్వబ్రాహ్మణ విశ్వకర్మలను ప్రభుత్వం ఆదుకోవాలి

సైఫాబాద్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: నేటి ప్రపంచీకరణ నేపథ్యంలో కంప్యూటర్ యుగంలో ప్రస్తుతం కొనసాగుతున్న కార్పోరేట్, ప్రైవేటు వ్యవస్థలో చేతి వృత్తులు కోల్పోయిన విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని రాష్ట్ర విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం డిమాండ్ చేసింది. టిఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 సంవత్సరాలు గడిచినప్పటికి ఇప్పటివరకు ఏలాంటి సంక్షేమ పథకాలు చేపట్టలేదని, అసలు పట్టించుకోవడం లేదని సంఘం ఆరోపించింది. బుధవారం ఎన్‌ఎస్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు డా.లలుకోట వెంకటాచారి, అధ్యక్షుడు వేములవాడ మదన్‌మోహన్, ప్రధాన కార్యదర్శి చోల్లేటి కృష్ణమాచారి మాట్లాడుతూ ప్రతి ఏడాది బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం విశ్వబ్రాహ్మణులను విస్మరిస్తున్నదని దీంతో కులవృత్తులపై ఆదారపడిన విశ్వకర్మలు నిరాశ నిస్పృహాలకు గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గత ఏడాది అసెంబ్లీ సాక్షగా విశ్వబ్రాహ్మణులకు బడ్జెట్‌లో కేటాయించిన 250 కోట్ల నిధులు ఇప్పటి వరకు విడుదల చేయకపోవడం దారుణమన్నారు. తక్షణమే ప్రభుత్వం విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ కార్పోరేషన్‌కు నిధులు విడుదల చేయాలని, ప్రస్తుత బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు.

## స్వర్ణోత్సవ వేడుకల్లో ఒయూ ఐసిఎస్ఎస్ఆర్



స్వర్ణోత్సవ వేడుకల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఓ.యూ వైస్ చాన్స్‌లర్ ప్రొ.రవీందర్ యాదవ్, ప్రొ.సుధాకర్‌రెడ్డి

తార్నాక, ఫిబ్రవరి 8 ప్రభాత వార్త: ఒ.యూ ఐసిఎస్‌ఎస్ ఆర్.. ఎస్‌ఆర్‌సి ఆద్వర్యంలో మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థహాల్లో మూడు రోజుల పాటు జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. స్వర్ణోత్సవ వేడుకల్లో భాగంగా జాతీయ సెమినార్‌కు సంబంధించి రూపొందించిన వాల్ పోస్టర్‌ను ఒ.యూ వైస్ చాన్స్‌లర్ ప్రొ.రవీందర్ యాదవ్ రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మినారాయణ, సదస్సు కన్వీనర్ ప్రొ.సుధాకర్‌రెడ్డితో కలిసి బుధవారం ఆవిష్కరించారు. సదస్సు కన్వీనర్ ప్రొ.సుధాకర్‌రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ సాంఘిక శాస్త్ర పరిశోధనలను ప్రోత్సహించేందుకు 1969లో ఐసిఎస్‌ఎస్‌ఆర్‌ను నెలకొల్పినట్లు వారు చెప్పారు. సెమినార్‌లో పబ్లిక్ పాలసీస్, డెవలప్ మెంట్ అండ్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ సోషల్ గ్రూప్ ఇన్ ఇండియా లైసన్స్ ప్రమ్ తెలంగాణ స్టేట్ అనే అంశంపై సదస్సు ఉంటుందన్నారు. సదస్సులో తమ పరిశోదనా పత్రాలను సమర్పించుకునే వారు పరిశోధనా పత్రం అబ్‌స్ట్రాక్‌ను మార్చి 10లోగా తమకు చేరేలా పంపాలని వారు సూచించారు. బ్రోచర్ ఆవిష్కరణలో సదస్సు కోకన్వీనర్ డా.జాకబ్ పాల్గొన్నారు.

## ఘనంగా వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు



వేణుగోపాల స్వామి ఊరేగింపులో కె.పి విశాల్‌గౌడ్

పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల డివిజన్ పరిధి కుత్బుల్లాపూర్ గ్రామంలో జరుగుతున్న శ్రీవేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథోత్సవం, చక్రస్నానం, స్వామివారి ఊరేగింపు కార్యక్రమంలో బుధవారం యువనేస్తం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కె.పి విశాల్‌గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కె.పి విశాల్‌గౌడ్ మాట్లాడుతూ సుమారు 150 సంవత్సరాలకు పైగా చరిత్ర ఉన్న శ్రీవేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గ్రామ పురవీధుల్లో స్వామివారిని ఊరేగింపులో గ్రామ ప్రజలందరూ భాగస్వాములై పాల్గొనడం పూర్వజన్మ సుకృతం అన్నారు. శ్రీవేణుగోపాల స్వామి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని వేడుకున్నానన్నారు. ఈ ఊరేగింపు కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ ధర్మకర్త, భక్తులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల కార్యవర్గ సమావేశం



రక్తదాన పోస్టర్ ఆవిష్కరిస్తున్న టిఎన్‌జిఓ అధ్యక్షులు ఎస్.ఎం.ముజీబ్‌హుస్సేనీ,ఉద్యోగులు

గన్‌ఫౌండ్రి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: టిఎన్‌జిఓ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్.ఎం.ముజీబ్ హుస్సేనీ ఆద్వర్యంలో జిల్లా ఉద్యోగుల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన ఉద్యోగుల నుంచి ఉద్దేశించి మాట్లాడుతూ యూనిట్ లోని సమస్యలను గురించి, ముఖ్యంగా కాంట్రిబ్యూటరీ పెన్షన్ ఉద్యోగుల సమస్యలను తెలుసుకున్నారు. సంవత్సరం చందా ఇవ్వని యూనిట్లపై ఆరాతీశారు.జిల్లా తీసుకున్న అత్యవసర,అతి ముఖ్యమైన రక్తదాన శిబిరంమీద క్లుప్తంగా ప్రసంగించారు.ఈనెల 17వ తేదిన ముఖ్యమంత్రి కెసిఆర్ జన్మదినం సందర్భంగా చేపట్టిన రక్తదాన శిబిరానికి ఉద్యో గులు,బంధుమిత్రులు కూడా హాజరు కావాలన్నారు.ఈసమావేశంలో జిల్లా కార్యదర్శి విక్రమ్ కుమార్,కార్యనిర్వాహక అధ్యక్షులు కె.ఆర్. రాజ్‌కుమార్, కె.శ్రీనివాస్, బాల్‌రాజ్,పి.వరదరాజు,ఓమరఖాన్, ముఖీం,ఖలీల్అహ్మద్‌లతోపాటు ప్రభాకర్,యూనిట్ల అధ్యక్షులు,కార్యదర్శులు పాల్గొన్నారు.

## బామ్మర్దే సూత్రధారి

### పంజాగుట్ట కిడ్నాప్ కేసును ఛేదించిన పోలీసులు

**బావమరిది రాజేష్‌తో సహా ఆరుగురు అరెస్ట్ పరారీలో మరోనిందితుడు**



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపి మోహన్ కుమార్, సిఐ హరిశ్చంద్రారెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త: భాగ్యనగరంలో ఇటీవల కలకలం సృష్టించిన ఓవ్యక్తి కిడ్నాప్ కేసును పంజాగుట్ట పోలీసుల ఛేదిం చారు. ఈకేసులో బాధితుడి బామ్మర్దే సూత్రధారి అని తెలుసుకున్న పోలీసులు అవాక్కయ్యారు. నమ్మకంగా ఉండాల్సిన కుటుంబ సభ్యులే డబ్బుల కోసం బరితెగించడం పోలీసులను సైతం విస్మయానికి గురిచేసింది. ఈమేరకు బుధవారం పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పంజాగుట్ట ఏసీపీ మోహన్‌కుమార్ కేసు వివరాలను వెల్లడించారు. ఓవర్‌సీస్ జాబ్ కన్సల్టెంట్‌గా పనిచేస్తున్న అమీర్‌పేట్‌కు చెందిన మురళీకృష్ణ ..గత నెల 27న అమీర్‌పేట్ లాల్‌బంగ్లా సమీపంలో నీరజ్ పబ్లిక్ స్కూల్‌లో పిల్లల్ని వదిలి వస్తుండగా ఇన్నోవా కారులో వచ్చిన ఐదుగురు అడ్డుకున్నారు. ఆదాయపుపన్ను అధికారులమని చెబుతూ మురళీ కృష్ణను బలవంతంగా కారులో ఎక్కించుకున్నారు. అనంతరం నగర శివారులోని బాటసింగారం వద్ద నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్ళి.. రూ 60లక్షలు ఆదాయపు పన్ను చెల్లించాలన్నారు. అంఆదుకు మురళీ కృష్ణ అంగీకరించదకపోవడంతో చేయి చేసుకున్నారు. అతడి బావమరిదిని అరెస్ట్ చేశామని చెప్పి...అతడి ఫోన్‌లో మాట్లాడించారు. చివరికి భార్యను కూడా అరెస్ట్ చేస్తామని బెదిరించారు. దీంతో భయపడిన మురళీకృష్ణ, తన భార్యకు జరిగింది చెప్పి..రూ.30లక్షలు సిద్ధం చేయించాడు. బావమరిదికి డబ్బులు ఇచ్చి ..నాంపల్లి వద్దకు నిందితుల్ని రప్పించారు. అక్కడ బ్యాగ్ తీసుకున్న తర్వాత ..నిందితులు మురళీకృష్ణను ఔటర్ రింగ్‌రోడ్‌వద్ద వదిలేశారు. అక్కడి నుంచి ఇంటికి చేరుకున్న బాధితుడు ఈనెల 4న పంజాగుట్ట పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మొబైల్ సిగ్నల్స్,సిసి కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేసి కేసును చేధించారు.బాధితుడు మురళీకృష్ణ బావమరిది రాజేశ్. ఈకిడ్నాప్‌కు ప్రధాన సూత్రధారి అని ఏపిసి మోహన్‌కుమార్ తెలిపారు. రాజేష్‌తనకు వరుసకు సోదరుడైన విజయవాడకు చెందిన డి.రాఘవేంద్ర, అతనితోపాటు జీవన్‌కుమార్, అబ్దుల్ సలీమ్, పలపు లక్ష్మయ్య, ఎ.కృష్ణ గోపాల్ (కిట్టు), శ్రీనివాస్ (వాసు) తదితరులను గ్రూప్‌గా చేసుకుని ఈకిడ్నాప్‌కు పాల్పడ్డారు. అనంతరం మురళీకృష్ణ భార్య లావణ్యతో ఫోన్‌లో మాట్లాడి రూ.60లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆమె రూ.30లక్షలే ఉన్నాయని తన సోదరుడు రాజేష్‌కు ఇచ్చి పంపింది. ఈరూ.30లక్షలు అందిన తర్వాత మరళీకృష్ణను ఔటర్ రింగ్‌రోడ్డు వద్ద వదిలి పెట్టారు. రాజేష్‌తోపాటు ఏడుగురిని నిందితులుగా గుర్తించారు. ఆరుగురిని అరెస్ట్ చేయగా గౌస్ అనే వ్యక్తి పరారీలో ఉన్నాడు. కిడ్నాప్‌కు ఉపయోగించిన ఇన్నోవాతోపాటు 15.45లక్షల నగదు, టూవీలర్, ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని ఏసీపీ తెలిపారు.

# ఆల్విన్ కాలనీ డివిజన్ సమస్యలను పరిష్కరించాలి

**తక్షణమే అధికారులు పిన్ పాయింట్ ప్రోగ్రాం పెట్టాలి: : గజ్జల యోగానంద్**



ప్రెస్‌మీట్‌లో బుక్‌లెట్‌ను ప్రదర్శిస్తున్న బిజెపి శ్రేణులు

మూసాపేట, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త : అధికారులు, అధికార పార్టీ నాయకులు భూకబ్జాలు ఆపి ప్రజా సమస్యలపై దృష్టి పెట్టి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని గజ్జల యోగానంద్ పేర్కొన్నారు. జనవరి 2 నుంచి ఫిబ్రవరి 5వ తేదీ వరకు ఆల్విన్ కాలనీ డివిజన్ ప్రజల సమస్యలపై పాదయాత్ర నిర్వహించిన యోగానంద్ ప్రతి బస్తీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై 25 పేజీల బుక్‌లెట్ తయారు చేసి స్థానిక బిజెపి నాయకులు సమక్షంలో బుధవారం ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా యోగానంద్ మాట్లాడుతూ గత రెండు వారాల నుంచి పాదయాత్ర చేసి ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతీ సమస్యను రాసుకుని ప్రస్తుత ఎమ్మెల్యేకు అధికారులకు తెలియజేసినప్పటికీ ఎవరు పట్టించుకోవ దంలేదని విమర్శించారు. బిజెపి కార్యకర్తలు, నాయకులు ఉన్న ఏరియాలలో ఉద్దేశ్యపూర్వకంగా రోడ్లు కూడా వేయలేదని ఆరోపించారు. పర్యటించిన అన్నీ చోట్ల పారిశుద్ధ్య సమస్యలు ఉన్నాయని, కార్మికులు సరిగ్గా రావడం లేదని, డ్రైనేజి సమస్యతో ప్రజలు నిత్యం బాధపడుతున్నారని, 3రోజులకు ఒకసారి వచ్చే నీళ్ళు అరగంటకు మించి రావడంలేదని, విద్యుత్ వైర్లు ఇండ్ల మీద వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయని ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న పలు సమస్యలను తనతో చెపుతున్నారని తెలియజేశారు. మరి ప్రజలు కడుతున్న పన్నులు అన్ని ఎటుపోతున్నాయని ప్రశ్నించారు. అధికారులు ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలపై తక్ష ణమే పిన్‌పాయింట్ ప్రోగ్రాం పెట్టి రోడ్డు, డ్రైనేజి, మంచినీరు, దోమల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బిఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే, కార్పొరేటర్, కార్యకర్తలు కబ్జాలు, వసూళ్ళు మానుకుని ప్రజా సమస్యలపై దృష్టి పెట్టి సమస్యలను పరిష్కరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆల్విన్ కాలనీ డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ సురభి రవీందర్, స్రవంతి విజిత్‌వర్మ, రామరాజు, కేశవరావు, నరసింహారావు, రమేష్, రామకృష్ణ, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ అభివృద్ధే ప్రధాన లక్ష్యం: ఎమ్మెల్యే ముఠాగోపాల్

**ప్రొటోకాల్ పాటించక పోవటంపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన కార్పోరేటర్ రచనశ్రీ**



సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ధర్నాచౌక్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త: రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచే స్తున్నామని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. బుధవారం కవాడిగూడ డివిజన్‌లోని భాగ్యలక్ష్మి నగర్‌లో 15 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన స్థానిక కార్పోరేటర్ రచనశ్రీతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ ముషీరాబాద్ నియోజకవర్గంలో జనాభాకు అనుగుణంగా మంచినీరు, డ్రైనేజి పైప్‌లైన్‌లను ఆధునీకరించిన తరువాతనే సీసీ, విడిసీ రోడ్ల నిర్మాణం చేపట్టటం జరుగుతోందని తెలిపారు. ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువనేత ముఠాజైసింహ, స్థానిక నాయకులు వల్లాల శ్యాం యాదవ్, ఎన్.డి.సాయికృష్ణ, రాజశేఖర్ గౌడ్,శ్రీహరి, ప్రభాకర్, ప్రవీణ్‌గౌడ్, బీజేపీ నాయకులు ఎం.సి.మహేందర్ బాబు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

**కార్పోరేటర్ ఆగ్రహం:** కవాడిగూడ డివిజన్‌లో ఎక్కడ అభివృద్ధి కార్యక్రమాలు జరిగినా జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రొటోకాల్ పాటించటం లేదని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికార పార్టీ ఎమ్మెల్యేకు ముందుగా సమాచారం అందించి, తనకు మాత్రం అభివృద్ధి కార్యక్రమ ప్రారంభానికి కొద్ది నిమిషాల ముందు సమాచారం ఇస్తున్నారని ఆరోపించారు. ఏకపక్షంగా వ్యవహరిస్తున్న మున్సిపల్ అధికారులపై కమీషనర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

## మనుస్మృతి పుస్తకాన్ని నిషేధించాలి

**సమతా సైనికదళ్ అధ్యక్షుడు దాసరి లక్ష్మయ్య**

హైదరాబాద్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త : మనుస్మృతి ప్రాచీన భారత రాజ్యాంగం పేరిట వస్తున్న వేద ధర్మ ప్రచార ట్రస్ట్ అనువాద పుస్తకాన్ని నిషేధించాలని ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి లక్ష్మయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న ప్రభుత్వ సలహాదారు కె.వి.రమణాచారి ఈ పుస్తకావిష్కరణకు వెళ్లడమంటే భారత రాజ్యాంగాన్ని అవమానించడమేనని చెప్పారు. ఈ మేరకు బుధవారం దాసరి లక్ష్మయ్య ఒక ప్రకటన చేస్తూ మనుస్మృతి ప్రాచీన భారత రాజ్యాంగం, శిక్షస్మృతి తెలుగు అనువాద పుస్తకం వెనుక భారీ కుట్ర ఉందన్నారు. సమాజంలోని ప్రజల మధ్య అంతరాన్ని పెంచి అంటరాని కులాలను సృష్టించిన మనువాద ధోరణిని మళ్లీ తెరమీదకు తెచ్చేందుకే ఈ తరహా పుస్తకాలను తెస్తున్నారని ఆరోపించారు. మనుస్మృతి పుస్తకాన్ని వెంటనే నిషేధించాలని, తెలుగు యూనివర్సిటీలో తలపెట్టిన ఆవిష్కరణ సభను రద్దు చేయాలని ఆయన కోరారు. లేదంటే సభను అడ్డుకోవడంతోపాటు పుస్తక ప్రతులను దగ్ధం చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

## బిసీలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చిన్నచూపు

అడ్డగుట్ట, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: దేశ జనాభాలో 52 శాతం ఉన్న బిసీలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయని, అందుకు బిసీలంతా సంఘటితంగా ఉద్యమించి సామాజిక న్యాయం కోసం పాటుపడాలని ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక రాష్ట్ర అధ్యక్షులు, హై కోర్టు న్యాయవాధి నాగులు శ్రీనివాస్ యాదవ్, కరసేవ సంక్షేమ రాష్ట్ర అధ్యక్షులు మామిడాల రాజులు తెలిపారు. సికింద్రాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ.45 లక్షల కోట్ల కేంద్ర బడ్జెట్‌లో బిసీలకు రూ.2 వేల కోట్లు కేటాయించిందన్నారు. అదే విధంగా రాష్ట్ర బడ్జెట్‌లో 6 వేల 200 కోట్లు కేటాయించిందన్నారు. అందు వల్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై వారు మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ వంగ రాములు గౌడ్,బోయ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు గోపి, తెలంగాణ గౌడ్ సంఘాల ఐక్య వేదిక కో-కన్వీనర్ దేశం మహేశ్ గౌడ్ పాల్గొన్నారు.

## కాంట్రాక్టు ఉద్యోగుల క్రమమద్దీకరణ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

**ఒయూ నాన్ టీచింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం**

తార్నాక, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: బడ్జెట్ సమావేశల సందర్భంగా మంత్రి హరీష్‌రావు కాంట్రాక్టు ఉద్యోగులను క్రమమద్దీకరిస్తామని ప్రకటించడాన్ని తాము స్వాగతిస్తున్నామని ఒ.యూ నాన్ టీచింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ మేరకు నాన్‌టీచింగ్ ఉద్యోగులంతా ఒ.యూ ఆర్ట్స్ కాలెజ్ ఎదుట స్వీట్లు పంచుకొని సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఒ.యూ నాన్‌టీచింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సూర్యచందర్, నాన్‌టీచింగ్ ఎంప్లాయిస్ అధ్యక్షుడు కట్టా వెంకటేష్, ఎడ్ల అంజి మాట్లాడుతూ ఎన్నోకేళ్లుగా ఎదిరిచూస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల ఆశలు నెరవేరబోతున్నాయని హర్షం వ్యక్తం చేసి ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు సి.శ్రీనివాస్, రమేష్ దాస్, డా. వీరేశం, మన్మోహన్, అజయ్, యారాల రాజేష్, కె.శ్రీకాంత్, మల్లికార్జున రావు, అబిద్ హుస్సేన్, ముజాహిద్, పాష, అరుణ్‌కుమార్, వెంకట్‌ముదిరాజ్, చేతన్, మల్లేష్, అభిలాష్, సతీష్, నరేందర్, శ్రీనివాస్‌రెడ్డి, శివతో పాటు పలువురు పాల్గొన్నారు.

## అమ్మవారికి కల్లుగుడాలు సమర్పిస్తే సంతృప్తి కలుగుతుంది : శ్రీగణేష్

అడ్డగుట్ట, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: శ్రీరేణుక ఎల్లమ్మకు కల్లు,గుడాలు సమర్పిస్తే అమ్మవారికి సంతృప్తి కలుగడంతో పాటు కోరుకున్న కోర్కెలు నెరవేరుతాయని కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన ప్రముఖ నాయకుడు ఎన్.శ్రీగణేష్ తెలిపారు బుధవారం 7వ వార్డు తిరుమలగిరి చిన్న కమేలాలోని రేణుక ఎల్లమ్మ దేవాలయంలో నిర్వహించిన కల్లు, గుడాల ఉత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

## ఆధార్ కార్డ్ ఎంతో ముఖ్యం : జంపనప్రతాప్



బోయిన్‌పల్లి పోస్టల్ కార్యాలయంలో ఆధార్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జంపనప్రతాప్ తదితరులు

అడ్డగుట్ట, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: సమాజంలో ఆధార్ కార్డు ఎంతో ముఖ్యమని, అందు వల్ల ఆధార్ కార్డులో ఏమైనా లొసుగులు ఉంటే వెంటనే సరి చేసుకోవాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ తెలిపారు. బుధవారం బోయిన్‌పల్లిలోని పోస్టల్ కారా ్యలయంలో ప్రజల సౌకర్యార్థం రెండు రోజుల పాటు ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో పోస్టల్ సిబ్బంది వర ప్రసాద్, షకీబ్, పెరుక మహేందర్, దఫేదార్ గణేష్, ముఖేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## అన్ని సమయాల్లో బస్తీ వాసులకు అండగా ఉంటా

**కార్పోరేటర్ చీరె సుచిత్రా శ్రీకాంత్**



బస్తీ వాసులను పరామర్శిస్తున్న కార్పోరేటర్ చీరె

బేగంపేట ఫిబ్రవరి 8, ప్రభాతవార్త : రాంగోపాల్‌పేట డివిజన్ పరిదిలోని మినిస్టర్ రోడ్‌లో ఇటీవల అగ్ని ప్రమాదం జరిగిన దక్కన్ మాల్ భవనం వద్ద కొనసాగుతున్న పనులను కార్పోరేటర్ చీరె సుచిత్రా శ్రీకాంత్ బుధవారం సందర్శించి పరిశీలించారు. భవనం మొత్తం పూర్తిగా ఇటీవల కూలిపోగా వ్యర్థాల తొలగింపు కార్యక్రమం జరుగుతుంది.ఈ కార్యక్రమాన్ని కార్పోరేటర్ పరిశీలించారు.అనంతరం సమీపంలోని కాచిబౌలి బస్తీ వాసులను కల్సి తాను అన్ని సమాయాల్లో అండగా ఉంటానంటూ వారికి భరోసా నిచ్చారు.భవనంలో అగ్ని ప్రమాదం సంభవించిన నాటి నుంచి నేటి వరకు ప్రతి రోజు బస్తీ వాసులకు ఆమె కల్సి ధైర్యం చెబుతూనే ఉన్నారు.ఈ కార్యక్రమంలో భాజపా కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోలీస్ సిబ్బందికి రివార్డులు



రివార్డు అందజేస్తున్న సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర

నిజాంపేట్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధి బాలానగర్ జోన్‌లోని బాచుపల్లి పోలీస్ స్టేషన్‌కు చెందిన పోలీసులు ఉత్తమ ప్రతిభను కనబర్చినందుకు సైబరాబాద్ స్టీఫెన్ రవీంద్ర వారిని అభినందించి రివార్డులు అందజేశారు. ఈనెల 5న ఎండు గంజాయిని విక్రయిస్తున్న ముఠాను అరెస్టు చేసి నిందితుల నుంచి 41కేజీల గంజాయిని స్వాధీనం చేసుకోవడంలో కీలకంగా వ్యవహరించిన బాలానగర్ జోన్ డీసీపి టి.శ్రీనివాస్‌రావు, కూకట్‌పల్లి ఏసీపీ చంద్రశేఖర్, బాచుపల్లి సీఐ నర్సింహరెడ్డి, ఎస్ఐ సాయినాథ్, కానిస్టేబుల్స్ రాజు, రాజేష్‌కుమార్, కనకయ్య, హరిలాల్‌లను సీపీ అభినందించి రివార్డులు అందజేశారు.

## ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తికి ఆర్థిక సహాయం

చిక్కడపల్లి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: ముషీరాబాద్ టూవీలర్ మెకానిక్ అసోసియేషన్ ఆధ్వరనయంలో రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ అసోసియేషన్ సభ్యుడు రామాచారికి ఆర్థిక సహాయం అందించే కార్యక్రమం బుధవారం జరిగింది. అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జగన్‌గౌడ్, బల్ల ప్రశాంత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు సీతాబాలకృష్ణ, బాలరాజ్ పాల్గొన్నారు.

# బడ్జెట్‌లో యాదవులకు 10 వేల కోట్లు కేటాయించాలి

**చలో అసెంబ్లీ ముట్టడిలో పాల్గొన్న యాదవులు అరెస్టు**



యాదవులను బస్‌లో పోలీస్ స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

సైఫాబాద్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది యాదవుల డిమాండ్లను అమలు చేయాలని కోరుతూ బుధవారం 'చలో అసెంబ్లీ ముట్టడి' కార్యక్రమంలో పాల్గొన్న యాదవులను అసెంబ్లీ సమీపంలో పోలీసులు బలవంతంగా అరెస్టు చేశారు. సమైక్యాంధ్ర పరిరక్షణ సమితి, జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి ఆధ్వర ్యంలో ఆనేక మంది యాదవులు నాంపల్లి నుంచి అసెంబ్లీని ముట్టడించడానికి వెళుతుండగా సమీపంలో పోలీసులు అడ్డుకుని బలవంతంగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వారిని పోలీసులు బస్‌లో ఎక్కించి నాంపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అంతకు ముందు పరిరక్షన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారమోని శ్రీశైలం యాదవ్ మాట్లాడుతూ యాదవ కార్పొరేషన్‌కు ప్రతి ఏడాది బడ్జెట్‌లో 10,000 కోట్లు కేటాయించాలని,రెండో విడత గోర్ల పంపిణికి వెంటనే నగదు పథకం కింద బ్యాంక్ అకౌంట్లలో డబ్బులు జమ చేయాలని, ఎస్‌ఎన్‌టి రిజర్వేషన్‌లు వెంటనే పునరుద్దరించాలని, నామినేటేడ్ పోస్టులలో యాదవులకు ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా యాదవులలో చైతన్యం తీసుకువచ్చి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని ఆయన హెచ్చరించారు. యాదవు నాయకులను పోలీసులు అరెస్టు చేశారన్న విషయాన్ని తెలుసుకున్న సమైక్యాంధ్ర పరిరక్షణ సమితి జాతీయ అధ్యక్షుడు కుమార్‌చౌదరియాదవ్ నాంపల్లి పోలీస్‌స్టేషన్‌కు వెళ్ళి అరెస్టుయిన వారిని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రజా శాంతి పార్టీ రాష్ట్ర నాయకుడు ఉపేంద్రయాదవ్, యాదవ సంఘం రాష్ట్ర నాయకులు నాగేష్‌యాదవ్, దుద్దు శ్రీనుయాదవ్, మండల శ్రీశైలంయాదవ్, వివిధ జిల్లాల నాయకులు శంకర్‌యాదవ్, అమర్‌యాదవ్, జపల్లి రాములుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## 10న ఆటో డ్రైవర్ల 'చలో అసెంబ్లీ ముట్టడి'


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బి.వెంకటేశం

సైఫాబాద్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త ఆటో డ్రైవర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ వేలాది మంది ఆటో డ్రైవర్లతో ఈ నెల 10న నిర్వహించతలపెట్టిన 'చలో అసెంబ్లీ ముట్టడి' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటేశం పిలుపు నిచ్చారు. ఈ మేరకు బుధవారం ఎఐటియుసి కార్యాలయంలో ఈ చలో అసెంబ్లీకి సంబంధించిన వాల్‌పోస్టర్ ను ఆవిష్కరించి మాట్లాడారు. పెరిగిన పెట్రోల్, డిజీల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలకు అను గుణంగా ఆటో మీటర్ చార్జీలను పెంచాలని, ఎపిలో ప్రభుత్వం ఆటో డ్రైవర్‌కు చెల్లించిన మాదిరిగానే ప్రతి ఏడాది ఆటో డ్రైవర్‌కు పది వేల రూపాయలు చెల్లించాలని, ఆటో మోటార్ రంగ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, పెరిగిన ఇన్సూరెన్స్ ధరలను తగ్గించాలని అలాగే ఇతర డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారుఈ కార్యక్రమంలో తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ జెఎసి నాయకులు ఎం.ఎ.సలీం, ఎ.సత్తిరెడ్డి, మహ్మద్ అమానుల్లా ఖాన్, ఆర్. మల్లేష్ పాల్గొన్నారు.

## వండర్‌బుక్ ఆఫ్ రికార్డులో చోటు


వండర్ బుక్ ఆఫ్ రికార్డు నమోదు పత్రాలను తీసుకుంటున్న పల్లవి మోడల్ స్కూల్ సిబ్బంది

నాచారం, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: విద్యార్థులకు మొబైల్ ఫోన్ల వల్ల వచ్చే దుష్ప్రభావాలను తెలియజేసే ఉద్దేశ్యంలో 700 మంది విద్యార్థులతో 15 నిమిషాల పాటు నిర్విఘ్నంగా నృత్యప్రదర్శన చేసినందుకు పల్లవి అవేర్ ఇంటర్నేషనల్ స్కూల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా పల్లవి గ్రూప్ ఆఫ్ ఛైర్మన్ మల్కా కొమురయ్య మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో చైతన్యం వస్తుందని చెప్పారు. విద్యార్థులకు నూతన ఉత్తేజాన్ని కల్గిస్తాయని వెల్లడించారు. పల్లవి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మల్కా యశస్వి మాట్లాడుతూ మొబైల్ వల్ల వచ్చే అనర్థాలపై విద్యార్థులకు మరింత అవగాహన కల్గించాల్సి ఉందన్నారు. ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డు ఇండియన్ ఛీఫ్ కోఆర్డినేటర్ బింగి. నరేందర్, తెలంగాణ ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డు కో ఆర్డినేటర్ విజయరంగ మాట్లాడుతూ విద్యార్థులు నేటి పోటీ ప్రపంచలో అన్ని రంగాల్లో ముందుండాలని సూచించారు. ఈ సందర్భంగా వండర్ బుక్ ఆఫ్ రికార్డు నమోదు పత్రాలను డైరెక్టర్ అనితా రెడ్డి స్కూల్ యాజమాన్యానికి అందజేశారు. నృత్య మాస్టర్ శివకుమార్, మాస్టర్ అనుదీప్‌లకు కొరియోగ్రాఫర్ శిక్షణా పత్రాలను అందజేసి అభినందించారు.

## సుకన్య సమృద్ధి యోజనను సద్వినియోగం చేసుకోండి

### పోస్ట్ ఆఫీస్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ సాగర్ దండప్ప


సుకన్య సమృద్ధిపై అవగాహన కల్పిస్తున్న సాగర్

కెపిహెచ్‌బి కాలనీ, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త : తపాలా శాఖ ఆధ్వర్యంలో బాలికల కోసం సుకన్య సమృద్ధి యోజన కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని దీన్ని ప్రతీ ఒక్కరూ సద్వినియోగపరుచుకోవాలని సికింద్రాబాద్ సౌత్ సబ్ డివిజన పోస్ట్ ఆఫీస్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ సాగర్ పిలుపునిచ్చారు. బుధవారం కెపిహెచ్‌బి కాలనీలోని పోస్ట్ ఆఫీస్‌శాఖ ఆధ్వర్యంలో గత కొన్ని రోజులుగా కూకట్‌పల్లి నియోజకవర్గంలోని పలు డివిజన్లలో సుకన్య సమృద్ధి యోజన కార్యక్రమాన్ని ఉచితంగా ప్రచారం చేస్తూ పలువురిని భాగస్వాములు చేస్తున్నారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ 10 సంవత్సరాలు వయసు కంటే తక్కువ ఉండి సుకన్య అకౌంట్స్ లేని అమ్మాయిలు అందరూ ఈ డ్రైవ్‌లో పాల్గొని తమ కూతుర్లకు సుకన్య అకౌండ్స్ ఓపెన్ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ అకౌంట్ ఓపెన్ చేయడానికి బాలికల బర్త్ సర్టిఫికెట్, తల్లి తండ్రి ఎవరో ఒకరి ఆధార్, పాన్‌కార్డు, మూడు ఫోటోస్ ఇస్తే సరిపోతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి జెరూడిక్షన్ పబ్లిక్ రిలేషన్ ఇన్స్‌పెక్టర్ ఎంసి నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

## మీర్‌పేట్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించండి: కాంగ్రెస్ కార్పొరేటర్లు


కమీషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న కాంగ్రెస్ కార్పొరేటర్లు

సరూర్‌నగర్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: దాదాపు ఐదు నెలల నుండి కౌన్సిల్ సమావేశాలను ఏరా ్పటు చేయకపోవడం వల్ల మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయనీ ఈ నేపథ్యంలో తక్షణమే కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ చల్లా కవితా బాల్‌రెడ్డి, కార్పొరేటర్ సిద్దాల మౌనిక శ్రీశైలంలు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు డిసిసి అధ్యక్షుడు చల్లా నరి ్సంహా రెడ్డి, పలువురు పార్టీ నాయకులతో కలిసి కమీషనర్ నాగేశ్వర్‌రావుకు ఒక వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 90 రోజులకు ఒక సారి జరపాల్సిన సాధారణ సమావేశాన్ని నిర్వహించకపోవడంతో ప్రజా సమస్యలను కార్పొరేటర్లు పరిష్కరించలేని దుస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. వేసవి ప్రారంభం అవుతుండడంతో కార్పొరేషన్‌లో నీటి సమస్యలు తీవ్రమవుతున్నాయనీ అంతే కాకుండా డ్రైనేజీ, విద్యుత్ సమస్యల వల్ల కూడా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వారు పేర్కొన్నారు. కార్పొరేషన్‌లో కొత్త కౌన్సిల్ ఏర్పడినప్పటి నుండి ఈ మూడు సంవత్సరాల కాలంలో అభివృద్ధికి ఎన్ని కోట్లు ఖర్చు పెట్టారో? వార్డుల వారీగా శ్వేత పత్రం విడుదల చేయాలని వారు కమీషనర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు సామిడి గోపాల్‌రెడ్డి, మాజీ వార్డు మెంబర్ కీసర యాదిరెడ్డి, ఆల శ్రీనివాస్‌రెడ్డి, ఐతరాజు భాస్కర్, శేఖర్‌రెడ్డి, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేషన్లలో కూడా బిఆర్ఎస్, బిజెపిల కుమ్మక్కు : డిసిసి అధ్యక్షుడు చల్లా


సమావేశంలో మాట్లాడుతున్న డిసిసి అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి

సరూర్‌నగర్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: కేంద్రంలో, రాష్ట్రంలోనే కాకుండా చివరకు కార్పొరేషన్లలో కూడా బిఆర్ఎస్, బిజెపిల లోపాయకారి ఒప్పందాలు చేసుకుంటూ కుమ్మక్కు అవుతున్నాయని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ఆరోపించారు. బుధవారం మీర్‌పేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరానికి ఆనుకొని ఉన్న మీర్‌పేట్ కార్పొరేషన్‌లో ప్రజల ఇంటి, నీటి పన్నుల తగ్గింపు కోసం గత నెల రోజుల నుండి కాంగ్రెస్ పోరాడుతుంటే కార్పొరేషన్‌లో అధికార బిఆర్ఎస్ తర్వాత ఎక్కువ సంఖ్యలో కార్పొరేటర్లు ఉన్న బిజెపి మాత్రం ప్రజా సమస్యలను గాలికి వదిలి నామమాత్రంగా కమీషనర్‌కు వినతి పత్రం ఇచ్చి చేతులు దులుపుకుందని విమర్శించారు. అయితే కాంగ్రెస్ మాత్రం రాజకీయాలకు అతీతంగా కార్పొరేషన్‌లో ప్రజా సమస్యలపై పోరాడుతుందని చల్లా స్పష్టం చేశారు.

## పేద వధువులకు ఉప్పల ఫౌండేషన్ చేయూత


వధువులకు కానుకలు అందజేస్తున్న ఛైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త

ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: నిరుపేద వధు వులకు ఉప్పల ఫౌండేషన్ ఛైర్మన్ రాష్ట్ర పర్యాటక శాఖ అభి వృద్ధి ఛైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త పేర్కొన్నారు. నాగోలు ఉప్పల క్యాంపు కార్యాలయంలో బుధవారం పేద వధువులకు పుస్తె మట్టె లు, గాజులు, దుస్తులను శ్రీనివాస్‌గుప్త కానుకగా అందజేశారు.

## పెండింగ్ పనులు పూర్తి చేయాలి : కార్పొరేటర్


జోనల్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం సమర్పిస్తున్న కార్పొరేటర్ సామలహేమ

సికింద్రాబాద్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త : సీతాఫల్‌మండి డివిజన్‌లో జరగాల్సిన అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ సామలహేమ జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ బండారి శ్రీనివాస్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు ఆయనకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లో జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో జరగాల్సిన అభివృద్ధి పనులు ఉన్నాయన్నారు. పలు ప్రాంతాలలో రోడ్ల నిర్మాణం కోసం ఇప్పటికే నిధులు కూడా మంజూరై ఉన్నాయని తెలిపారు. వీటితో పాటు కొత్తగా రోడ్ల కోసం ప్రతిపాదనలు పంపామని, వాటికి కూడా నిధులు మంజూరు చేసి రోడ్లను వేయానలి కోరారు. జోనల్ కమిషనర్‌తో పాటు ఎస్ఈ అనిల్‌రాజ్‌ను కూడా కలిసి మహ్మద్ గూడలోని నాలా గోడ నిర్మాణ పనులు కూడా త్వరగా పూర్తి చేయాలని కోరినట్లు తెలిపారు. అలాగే నాలలో పూడికను ఎప్పటికప్పుడు చేపట్టాలని కోరామన్నారు. ఈ కార్యాక్రమంలో బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

## మానసిక ప్రశాంతతకు దేవుళ్లను పూజించాలి


పెరుమాల్ దేవాలయంలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఉగ్ర నర్సింహారెడ్డి, చైర్మన్ నర్సారెడ్డి తదితరులు

కంటోన్మెంట్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: ప్రజలు ఎల్లప్పుడు ఆరోగ ్యంగా జీవించాలని స్వామి వారిని వేడుకున్నట్లు కనిగిరి మాజీ ఎమ్మెల్యే ఉగ్ర నరి ్సంహారెడ్డి తెలిపారు. సికింద్రాబాద్ శివాజీ నగర్‌లో ప్రసిద్ధిగాంచిన శ్రీ వెంకటేశ్వర పెరుమాల్ దేవాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజా కార్యక్రమాలకు ఆయన ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. భగవంతున్ని వేడుకుంటే కోరుకున్న కోర్కెలు నెరవేరుతాయన్నారు. మానసిక ప్రశాంతతకు దేవుళ్లను పూజించాలన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన మాజీ ఎమ్మెల్యేకు ఆలయ చైర్మన్ వై.నర్సా రెడ్డి శాలువకప్పి పూలమాలతో ఘనంగా సత్కరించారు.

### హబ్సిగూడలో కాంగ్రెస్ పార్టీ జోడో యాత్ర

ఉప్పల్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త : ఉప్పల్ సర్కిల్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన హాత్ సే హాత్ జోడో యాత్రలో పలువురు కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షుడు మందముల్ల పరమేశ్వర్‌రెడ్డి తోపాటు, డివిజన్ అధ్యక్షుడు కాలేరు జైనవీన్ ఆధ్వర్యంలో టిపిసిసి ప్రతినిధులు మేకల శివారెడ్డి, ఎం.డి.తౌఫిక్, పిసిసి కార్యదర్శి పసుల ప్రభాకర్‌రెడ్డి, కంది ఆగిరెడ్డి, పత్తికుమార్, అకారపు అరుణ్‌కుమార్, కంది శ్రవణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైలు ఢీకొని వృద్ధుడు మృతి

నాంపల్లి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త : నాంపల్లి జీఆర్‌పి పరిధిలో రైలుపట్టాలు దాటుతుండగా రైలుఢీకొని ఒక గుర్తుతెలియని వృద్ధుడు మృతిచెందిన దుర్ఘటన శనివారం ఉదయం 7.30గంటలకు చోటుచేసుకుంది. హైదరాబాద్ జీఆర్‌పి హెడ్‌కానిస్టేబుల్ పి.నరసింహారావు తెలిపిన వివరాల్లోకి ప్రకారం.. హైటెక్‌సిటీ రైల్వేస్టేషన్ ఫ్లాట్‌ఫాం నంబరు 1 చివరిలో అండర్‌బ్రిడ్జ్ కిలోమీటర్లు నంబరు 169/12-14 వద్ద వేగంగా వస్తున్న గుర్తుతెలియని రైలు గమనించకుండా పట్టాలుదాటుతున్న వృద్ధుడుని ప్రమాదవశాత్తు రైలుఢీకొని తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి వయస్సు 60 సంవత్సరాలు. ఎత్తు 5.5 అడుగులు, కోలముఖం, తెలుగు నలుపు జుట్టు, ఎడమచేతిమీద సాయి చరణ్, కుడిచేతిమీద కుమారి హసని అనే పచ్చబొట్లు ఉన్నాయి. మృతుడు నల్ల రంగు ఫుల్‌హ్యాండ్స్ రెడీమేడ్ షర్టు, తెల్లరంగు ప్యాంటు, ఆకుపచ్చరంగు కట్‌డ్రాయర్ ధరించి ఉన్నాడు. మృతదేహానికి పంచనామా చేసి, కేసు నమోదుచేసి ఉస్మానియా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం మార్చురీలో భద్రపరిచారు. **మరో దుర్ఘటనలో యువకుడు మృతి..** గుర్తుతెలియని యువకుడి మృతదేహం బుధవారం మధ్యాహ్నం 2.10గంటల సమయంలో లభ్యమైంది. లింగంపల్లి రైల్వేస్టేషన్ ఫ్లాట్‌ఫాం నంబరు 1 సమీపంలో కిలోమీటరు 161/11 వద్ద బార్‌లెవల్ మధ్యలో సహజ మరణం పొందాడు. మృతుడు వయస్సు 40 సంవత్సరాలు. 5.3 అడుగుల ఎత్తు, కోలముఖం, నలుపు ఎరుపు జుట్టు, పొట్ట ఎడమవైపు పుట్టుమచ్చ, నలుపు ఎరుపు ఆకుపచ్చ రంగులున్న ఫుల్‌హ్యాండ్స్ టీషర్టు, పసుపు తెలుపురంగు గల మరో టీషర్టు లోపల, ఎరుపు ఆకుపచ్చరంగు డ్రాయర్ ధరించి ఉన్నాడు. లింగంపల్లి రైల్వేస్టేషన్ మాస్టర్ ఇచ్చిన సమాచారం మేరకు మృతుని శవానికి పంచనామా నిర్వహించి, కేసు నమోదుచేసి, ప్రభుత్వ ఉస్మానియా ఆస్పత్రిలో పోస్టుమార్టం తర్వాత మార్చురీలో భద్రపరిచారు. పై రెండు కేసుల్లో మృతుల సంబంధీకులు పూర్తి వివరాలకు నాంపల్లి హైదరాబాద్ జీఆర్‌పి ఫోన్ నంబరు 040-23202238 లేదా హెడ్‌కానిస్టే బుల్ పి.నరసింహారావు మొబైల్ నంబరు 9000394635లో సంప్రదించవచ్చును.

## జీవో 60ని అన్ని శాఖల్లో వెంటనే అమలు చేయాలి: మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి


ప్రసంగిస్తున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

చిక్కడపల్లి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో జీవో 60ని అన్ని శాఖల్లో వెంటనే అమలు చేయాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్కు వద్ద తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షురాలు పద్మశ్రీ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ ధర్నాను ఉద్దేశించి జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతఊా జీవో 60 విడుదలై 20 నెలలు గడుస్తున్నా ఇంకా 30శాతం శాఖల్లో అమలు కాకపోవడం అన్యాయమని, రాష్ట్రంలో 90లక్షల కుటుంబాలకు సేవలందిస్తున్న ఈ సిబ్బందికి వేతనాలు చెల్లించడంలో తీవ్ర జాప్యం జరుగుతోందని, ప్రతి నెల 5లోగా జీతాలు చెల్లించాలని, సమానపనికి-సమానవేతనం, ఉద్యోగ భద్రత తదితర న్యాయమైన డిమాండ్ల కోసం ఫెడరేషన్ ఆధ్వర్యంలో పోరాటాలు కొనసాగించాలని, ఉద్యమానికి అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ ప్రదాన కార్యదర్శి జె.కుమారస్వామి, జి.సైదులు, ఆనందరెడ్డి పాల్గొని ప్రసంగించారు.

### ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి: కార్పొరేటర్ సుజాత నాయక్

సైదాబాద్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ అన్నారు. మార్నింగ్ వాక్‌లో భాగంగా నందనవనంలోని సమస్యలను పరిశీలించిన అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ పేదలకు బిఆర్ఎస్ పార్టీ ఎల్లవేళలా అండగా నిలుస్తుందన్నారు. కళ్యాణలక్ష్మి, షాదిముబారక్, దళితబంధు తదితర సంక్షేమ పథకాలను అర్హులందరు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## కూకట్‌పల్లిలో జోష్ నింపుతున్న హాథ్‌సే హాథ్ జోడోయాత్ర : సత్యంశ్రీరంగం


జోడో యాత్రలో పాల్గొన్న సత్యంశ్రీరంగం

కెపిహెచ్‌బి కాలనీ, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త : కెసిఆర్ ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను లక్షల కోట్ల అప్పుల కుప్పగా మార్చారనీ డా. సత్యంశ్రీరంగం ధ్వజమెత్తారు. కూకట్‌పల్లిలో కొనసాగుతున్న 3వ రోజు హాథ్ సే హాథ్ జోడో యాత్ర ప్రజల్లో జోష్ నింపుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. బుధవారం బాలానగర్ డిఎస్ కాలనీలోని పీజేఆర్ విగ్రహానికి పూలమాల వేసి ప్రారంభించారు. అక్కడి నుంచి సాయినగర్, చెరబండ, రాజునగర్, రాజు కాలనీ, వినాయక్‌నగర్ వరకు పిసీసీ సభ్యులు డా.సత్యంశ్రీరంగం ఆధ్వర్యంలో ఈ యాత్ర కొనసాగింది. ఈ కార్యక్రమానికి మేడ్చల్ మల్కాజగిరి జిల్లా ఎస్‌సి సెల్ అధ్యక్షులు పత్తి కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్, బిజెపి ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్ళడమే ఈ యాత్ర ఉద్దేశ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి పుష్పారెడ్డి, ఏ బ్లాక్ అధ్యక్షులు పి.నాగిరెడ్డి, ఎన్.రాజేందర్, మధుమోహన్, బి.నవీన్‌గౌడ్, ఎం.మల్లేష్, యాదగిరి, క్రిష్ణారాజ్‌పుత్, బి.బాలనర్సింహా తదితరులు పాల్గొన్నారు.

## విద్యా రంగానికి మొండి చేయి



నిరసన వ్యక్తం చేస్తున్న రాజేంద్రనగర్ ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు

చార్మినార్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా రంగానికి మొండి చేయి చూపాయని ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కె.వై.ప్రణయ్ అన్నారు. ఎస్ఎఫ్ఐ రాజేంద్రనగర్ కమిటి ఆధ్వర్యంలో బుధవారం ఆయన విద్యార్దులతో కలిసి జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా రంగాన్ని పూర్తిగా విస్మరిస్తున్నాయని, విద్యను బడుగు, బలహీన, మధ్య తరగతి, పేద విద్యార్దులకు అందని ద్రాక్షగా మారుస్తున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో తక్కువ నిధులు కేటాయించాయని ఆయన తెలియజేశారు. ఈకార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కమిటి సభ్యులు అర్జున్, కౌశిక్, ఆర్తి, లావణ్య, శ్రావ్య, శివలు పాల్గొన్నారు.


**BEFORE THE DEBTS RECOVERY TRIBUNAL, HYDERABAD – II, 1st Floor Triveni Complex, Abids, Hyderabad-500001.**

**Case No. OA 715 OF 2022**

Summons under subsection (4) of section 19 of the Act, read with sub rule (2A)of rule 5 of the debt recovery tribunal (procedure) rules 1993

**Between:**
**Union Bank of India**
**Bowenpally Branch** ...APPLICANT
**AND**
**Padmavathi Traders** and others ...DEFENDANTS

To,
**1. M/s Padmavathi Traders, Rep By its partner Sri Ramu Pulaparthi,** S/o Ramalingayya, H.No. 8-2-277/31, Plot No. 31, 1st floor UBI Colony, Road No 3, Banjarahills, Near TOS Restaurant, Hyderabad -500034.
**2. M/s Padmavathi Traders, Rep By its partner Sri Suram Srinivas,** S/o. Late Suram Sathaiah, H.No. 8-2-277/31, Plot No. 31, 1st floor, UBI Colony, Road No 3, Banjarahills, Near TOS Restaurant, Hyderabad- 500034.
**3. Sri Ramu Pulaparthi,** S/o. Ramalingayya H.No. 8-2-277/31, Plot No. 31, 1st floor, UBI Colony, Road No 3, Banjarahills, Near TOS Restaurant, Hyderabad- 500034.
**4. Sri Suram Srinivas,** S/o. Late Suram Sathaiah, H.No. 8-2-277/31, Plot No. 31, 1st floor, UBI Colony, Road No 3, Banjarahills, Near TOS Restaurant, Hyderabad -500034.

**SUMMONS / SUB SITUATED SERVICE BY WAY OF PAPER PUBLICATION**
**SUMMONS**

WHEREAS **OA 715 / 2022** was listed before Hon'ble Presiding officer/Registrar on 31-01-2023.

Whereas, this Hon'ble Tribunal is pleased to issue Summons / Notice on the said Application under Section 19(4) of the Act, (OA) filed against you for recovery of debts of **Rs. 32, 25, 791. 55ps ( Rupees Thirty Two Lakhs Twenty Five Thousand Seven Hundred Ninty One and Fifty Five Paise Only).**

In accordance with sub-section (4) of Section 19 of the Act, you the defendants are directed as under: -

**(i)** to show cause within 30 days of the service of summons as to why relief prayed for should not be granted;
**(ii)** to disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application;
**(iii)** you are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties;
**(iv)** you shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of your business any of the assets over which security interest is created and / or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal;
**(v)** you shall be liable to account for the sale proceeds realized by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the Bank or financial institutions holding security interest over such assets.

You are also directed to file the written statement with a copy thereof furnished to the applicant and to appear before the Registrar, on **23-03-2023** at 10:30 A.M. failing which the application shall be heard and decided in your absence.

**GIVEN UNDER MY HAND AND SEAL OF THIS TRIBNUAL ON THIS THE 07th DAY OF FEBRUARY, 2023.**

**Signature of the authorized officer to issue summons**

**M/s. SANGEETA JAISWAL,** Advocate, # 12-8-170, Mettuguda, Secunderabad.

**PUBLIC NOTICE**

General Public are hereby informed that **Sri TALREJA RAJESH S/o Late BALDEV,** R/o. Flat No.301, 3rd Floor, Sree Datta Sai Apts., Kakaguda (V), Secunderabad Cantonment has approached the cantonment Board, Secunderabad for recording of his name in respect of Flat No.301, Third Floor, Sree Datta Sai Apts, Plot No.5 & 6, Shantideep Housing Colony, Kakaguda (V), Cantonment Board, Sec-bad. If anybody has or have any objection for mutation of the name of **TALREJA RAJESH** in the Tax records may contact the Executive Officer, Secunderabad Cantonment Board within a period of 15 days from the date of Publication of this notice, failing which mutation shall be accordingly ordered.

**Sd/- CHIEF EXECUTIVE OFFICER SECUNDERABAD CANTONMENT**
Office of the Cantonment Board, Court House Compound, Sardar Patel Road, Sec-bad-500003.
**Ph No.9490611193**

**వార్త VAARTHA CLASSIFIEDS**

**CHANGE OF NAME**

★ I, **NIKHAT SULTANA,** R/o.19-4-418/1/12, Bahadurpura, Behind Metro Theatre, Hyd-64, have to Change Name As **NIKHATH SULTANA** W/o.KHALID BIN FARAJ MISRI.

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

**దశదిన కర్మ**



జననం : 1930

మరణం : 31-01-2023

**కీ॥శే॥ శ్రీమతి కాసాని కౌసల్య ముదిరాజ్ గారు**
మాజీ సర్పంచ్ - బాచుపల్లి

మాటలకందని మమతానురాగాలకు ప్రతిరూపం మీరు. వెలకట్టలేని అనురాగం, ఆప్యాయతలు పంచిన ప్రేమ మూర్తిగా,
నీతి, నిజాయితీలకు మారుపేరుగా నిలిచి మా జీవితాలలో వెలుగు నింపి, తిరిగిరాని లోకాలకు పయనమైన
మీ ఆత్మకు శాంతి చేకూరాలని... మీ ఆశీస్సులు, మార్గదర్శకాలు మమ్ము ముందుకు నడిపిస్తాయని ఆశిస్తూ..
మీ జ్ఞాపకాలలో, మీరు పంచిన ఆత్మీయతలో మీ కోసం వెతుకుతూ మేము..! బరువెక్కిన హృదయంతో.. కన్నీటి నివాళి..!

కొడుకు - కోడలు : **కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ - చంద్రకళ**
Ex. MLC, టిడిపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు

మనుమళ్లు - మనుమరాళ్ళు :
కాసాని సుధాకర్ ముదిరాజ్ - శ్వేత
మాజీ సర్పంచ్, బాచుపల్లి- కార్పొరేటర్ / రంగారెడ్డి జిల్లా పరిషత్ Ex.వైస్ చైర్మెన్
కాసాని వీరేష్ ముదిరాజ్ - శిరీష (కార్పొరేటర్ )
కాసాని సతీష్ ముదిరాజ్ - మమత
కాసాని సాయిరాజేందర్ ముదిరాజ్
కాకి కేశవులు ముదిరాజ్ - జానకి దేవి
బండారి వెంకటేష్ ముదిరాజ్ - రాజేశ్వరి
బిల్లా సాయి చందర్ ముదిరాజ్ - మాధవి
పుట్ట సూరజ్ ముదిరాజ్ - శిల్ప

మునిమనుమళ్లు :
కె జె వరప్రసాద్, క్రిష్ణ, జ్ఞానేశ్వర్, క్రీష్వర్, అయాన్, జగత్ వీర్, చంద్రాన్ష్
మునిమనుమరాళ్ళు :
జయలక్ష్మీ, వైష్ణవి, హిరణ్మయి, అక్షయని, క్రిత్వి, నివాక్షీర
కాసాని కుటుంబసభ్యులు
బంధుమిత్రులు
మరియు
శ్రేయోభిలాషులు

పెద్దకర్మ: 09-02-2023 (గురువారం)

కార్యస్థలం: కాసాని కౌసల్య ఫామ్ హౌస్, రెడ్డి లాబ్స్ ఎదురుగా, బాచుపల్లి.

